అరసవల్లి ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యం

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని, రానున్న కాలంలో ఆలయ పరిసరాలను మరింత సుందరంగా తీర్చిదిద్దనున్నామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రూ.నాలుగు కోట్లతో చేపట్టనున్న ఇంద్రపుష్కరిణి పున: నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రపుష్కరిణిలో నిరంతరం స్వచ్ఛమైన నీరు ఉంచాలనే ఉద్దేశంతో నిర్మాణ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. జూలై లోగా పనులు పూర్తి చేస్తామన్నారు. త్వరలోనే రహదారుల అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు రఘువర్మ, నర్తు రామారావు, దేవాదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, ఇఒ హరి సూర్యప్రకాష్, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొను'గోల'

- జిల్లాలో 5 మండలాల్లో ప్రారంభం కాని కొనుగోలు
- ఇప్పటివరకు కొన్నది 46,378 మెట్రిక్ టన్నులు
- బ్యాంకు గ్యారంటీలు, సాంకేతిక సమస్యలు

చివరి గింజ వరకు ధాన్యం కొంటాం. దళారుల ప్రమేయం లేకుండా చేస్తాం. రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. ఇవీ ప్రజాప్రతినిధులు, అధికారులు ధాన్యం కొనుగోలు ప్రారంభంలో చెప్పే మాటలు. కొనుగోలు విషయానికి వచ్చేసరికి పాత కథే పునరావృతమవుతోంది. ధాన్యం కొనుగోలు చేయాలని జిల్లా అధికారులు క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నారే తప్ప పని జరగడం లేదు. డిసెంబరు మూడో వారంలోకి ప్రవేశించినా, ధాన్యం కొనుగోలు జోరందుకోలేదు. జిల్లాలో నేటికీ పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు తెరుచుకోలేదు. ధాన్యం సిద్ధంగా ఉన్నా కొనుగోలు చేయకపోవడంతో, రైతులు దళారులకు అమ్ముకుంటున్నారు. సాంకేతిక సమస్యలు, పూర్తిస్థాయిలో సిబ్బంది నియమించకపోవడం, ధాన్యం నాణ్యంగా లేకపోవడంతో మిల్లర్లు తీసుకునేందుకు నిరాకరించడం వంటి సమస్యలతో ధాన్యం కొనుగోలు ముందుకు సాగడం లేదు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, పలాస

పలాస : కొనుగోలు లేక కళ్లాల్లో ఉన్న ధాన్యం

ఖరీఫ్ సీజన్‌లో 3,51,843 ఎకరాల్లో వరి వేశారు. ఇందులో 3,50,765 ఎకరాలకు పంటల క్రాపింగ్ చేశారు. 3,34,330 ఎకరాలకు ఇకెవైసి పూర్తయింది. ఈ సంవత్సరం 8.17 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. అందులో 7,87,447 మెట్రిక్ టన్నులు మార్కెట్‌లోకి వస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం 5.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఈ సంవత్సరం వరికి సాధారణ రకానికి రూ.2,183, గ్రేడ్ 'ఎ' రకానికి రూ.2,203 మద్దతు ధర ప్రకటించింది. ధాన్యం కొనుగోలుకు అధికారులు జిల్లావ్యాప్తంగా 390 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాలను మూడు కేటగిరీలుగా విభజించారు. రెండు వేలు పైబడి ధాన్యం సేకరించే అవకాశం ఉన్న కేంద్రాలను ఎ-కేటగిరీగా, వెయ్యి నుంచి రెండు వేల టన్నుల్లోపు వరకు కొనుగోలు చేసే వాటిని బి-కేటగిరీగా విభజించారు. వెయ్యి టన్నుల కంటే తక్కువ ధాన్యం కొనుగోలుకు అవకాశం ఉన్న వాటిని సి-కేటగిరీగా నిర్ణయించారు. జిల్లాలో ఎ-కేటగిరీలో 182, బి-కేటగిరీలో 176, సి-కేటగిరీలో 32 కేంద్రాలు ఉన్నాయి.

ధాన్యం కొనుగోలు పరిస్థితి ఇలా...

జిల్లాలో గ్రేడ్-ఎ, సాధారణ రకం ధాన్యం కలిపి మొత్తం 46,378 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. కొనుగోలుకు 390 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు చెప్పినా, ఇప్పటివరకు 313 కేంద్రాలే తెరుచుకున్నాయి. పలాసలో ఒకే ఒక్క కేంద్రాన్ని తెరిచి 17.88 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నారు. సోంపేటలో మూడు కేంద్రాల ద్వారా 22.96 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. జి.సిగడాం మండలంలో రెండు కేంద్రాలను ప్రారంభించి, ఇప్పటివరకు 61.20 టన్నులను కొనుగోలు చేశారు. మందసలో తొమ్మిది కేంద్రాల ద్వారా 166.44 మెట్రిక్ టన్నులను కొన్నారు. ఆమదాలవలసలో ఏడు కేంద్రాల ద్వారా 221.16 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారు. కొత్తూరు మండలంలో 25 కేంద్రాలను తెరిచి 2,271.84 మెట్రిక్ టన్నులను కొన్నారు.

కొనుగోలు చేయకపోవడంపై రైతుల ఆగ్రహం

ధాన్యం కొనుగోలుకు లక్ష్యం పెట్టుకోలేదంటూ అధికారులు చెప్తున్నా, కేంద్రాలకు నిర్దేశించిన మేరకే కొంటున్నారు. మిల్లులకు ఇచ్చిన ధాన్యం మేరకు మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలు తీసుకుంటున్నారు. బ్యాంకు గ్యారంటీలు పూర్తి కావడంతో, ఆర్‌బికె సిబ్బంది తర్వాత వచ్చిన వాటిని వెనక్కి పంపిస్తున్నారు. ఎల్ఎన్‌పేట మండలం రావిచంద్రిలో రైతులకు ఇదే సమస్య ఎదురైంది. రైతులు కోపోద్రిక్తులు కావడం, బత్తిలి-అలికాం రోడ్డుపై ధాన్యం ట్రాక్టర్లతో నిరసన దిగడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. జిల్లాలో పలు కేంద్రాల్లో ఇదే పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది.

నత్తనడకన కొనుగోళ్లు

ధాన్యం కొనుగోలుకు అధికారులు అన్నిరకాల ఏర్పాట్లు చేశామని అధికారులు చెప్తున్నా, క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితులు కనిపించడం లేదు. జిల్లాలో ఇప్పటివరకు 22 మండలాల్లో మాత్రమే కొనుగోలు చేశారు. 313 కేంద్రాలు తెరుచుకున్నాయి. ఇప్పటివరకు 46,378 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు. ఇందులో గ్రేడ్-ఎ రకం 23.36 మెట్రిక్ టన్నులు కాగా, సాధారణ రకం ధాన్యం 46,378 మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేశారు. బ్యాంకు గ్యారంటీలు, సాంకేతిక సమస్యలు వంటి సమస్యలతో ధాన్యం కొనుగోలు సాఫీగా సాగడం లేదు. రైతుల నుంచి వచ్చిన ధాన్యం వివరాలను రైతుభరోసా కేంద్రాల సిబ్బంది నమోదు చేస్తున్న సందర్భంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. కొన్ని మిల్లులకు భారీగా లోడులు వెళ్తుంటే, మరికొన్నింటికి స్వల్ప పరిమాణంలో వెళ్తున్నాయి.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలి
- సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్
- సమ్మెకు సిఐటియు, యుటిఎఫ్ మద్దతు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రెగ్యులరైజ్ తదితర సమస్యల పరిష్కారం కోరుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జెఎసి అధ్వర్యాన సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. జిల్లాలోని 223 మంది సిఆర్‌పిలు, 315 మంది పార్ట్ టైమ్ అధ్యాపకులు, 30 మంది ఎంఐఎస్‌లు, 15 మంది అకౌంటెంట్లు, 30 మంది అటెండర్లు, 30 మంది డేటాఎంట్రీ ఆపరేటర్లు విధులు బహిష్కరించి సమ్మెలో భాగస్వామ్యమయ్యారు. సమ్మెలో భాగంగా శ్రీకాకుళం నగరంలోని జ్యోతిబాపూలే పార్కు నుంచి కలెక్టరేట్ వరకు ఉద్యోగులు ప్రదర్శనగా వెళ్లి అక్కడ ధర్నా చేపట్టారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల పోరాటానికి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, పి.తేజేశ్వరరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేసి రాష్ట్రవ్యాప్తంగా 25 వేల మంది సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లాల్సిన పరిస్థితిని ప్రభుత్వమే కల్పించిందని విమర్శించారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు. మినిమం టైమ్ స్కేల్, హెచ్‌ఆర్‌ఎ, డిఎ అమలు చేసి, వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైమ్ విధానాన్ని రద్దు చేసి, ఫుల్ టైమ్ కాంట్రాక్టు విధానాన్ని అమలు చేసి వేతనాలు పెంచాలన్నారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చి మినియం ఆఫ్ టైం స్కేల్ అమలు చేయాలని తెలిపారు. రూ.పది లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్, గ్రాట్యుటీ సదుపాయంతో పాటు ఇపిఎఫ్, ఇఎస్ఐ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఒకటో తేదీకి వేతనాలు చెల్లించాలని, సంవత్సరానికి సరిపడే బడ్జెట్ ఒకేసారి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (జెఎసి) జిల్లా నాయకులు పి.తవిటినాయుడు, ధనుంజయరావు, జె.శ్రీనివాసరావు, ఎం.పోతయ్య, ఎ.అరుంధతి, జి.విజయలక్ష్మి సిహెచ్. శైలజ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తల కోసం

www.prajasakti.com epaper.prajasakti.com

ర్యాలీ నిర్వహిస్తున్న మెడికల్ రిప్స్

మెడికల్ రిప్స్ సమ్మె విజయవంతం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మందుల ధరలు తగ్గించాలని, మందులపై జిఎస్‌టి ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రెజెంటేటివ్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎంఆర్ఎఐ), ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ పిలుపు మేరకు జిల్లాలోని మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ బుధవారం చేపట్టిన ఒక్కరోజు సమ్మె విజయవంతమైంది. జిల్లావ్యాప్తంగా మెడికల్ రిప్స్ విధులు బహిష్కరించి సమ్మెలో భాగస్వామ్యమయ్యారు.

సమ్మెలో భాగంగా శ్రీకాకుళం నగరంలోని చిత్తరంజన్ వీధిలోని మెడికల్ హోల్‌సేల్, డిస్ట్రిబ్యూటర్స్ కార్యాలయాల ఎదుట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.వి.టి రాజు, ఎస్.మహేశ్వరరావు మాట్లాడుతూ సేల్స్ ఆధారిత వేధింపులు ఆపాలని, మందులు ధరలు తగ్గించడంతో పాటు మందులు వైద్య పరికరాలపై జిఎస్‌టి ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. అడ్డదారిలో దుకాణాలకు విక్రయిస్తున్న నకిలీ, నాసిరకం మందుల విక్రయాలను అరికట్టి ప్రజల ఆరోగ్యానికి రక్షణ కల్పించాలన్నారు. మందుల రంగంలో ప్రభుత్వ కంపెనీలను బలోపేతం చేయాలన్నారు. సేల్స్ ప్రమోషన్ ఉద్యోగులకు వర్తించే సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్‌ను యధాతథంగా అమలు చేయాలని, నిర్దిష్టమైన పని విధానాలను రూపొందించి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు వాసుదేవరావు, జిల్లా కోశాధికారి వై.శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు చంద్రశేఖరరావు, మెడికల్స్ రిప్రజెంటేటివ్స్ పాల్గొన్నారు.

విదేశీ ఉన్నత విద్యకు ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పేదరికం కారణంగా విదేశాల్లో ఉన్నత విద్య చదువుకోలేని విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తోందని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. విదేశీ విద్యా దీవెన పథకం మూడో విడత నిధులను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం బటన్ నొక్కి విడుదల చేశారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ మాట్లాడుతూ విదేశాల్లోని టాప్ 50 విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఇతర కోర్సుల్లో విద్యను అభ్యసించే వారికి శతశాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా విదేశాల్లో చదవాలనుకునే విద్యార్థులు తమ తల్లిదండ్రులపై ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం పొంది ఉన్నత విద్యను అభ్యసించవచ్చన్నారు. ఈ పథకానికి అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకొని విదేశీ విద్యను పొందాలన్నారు. జిల్లా నుంచి విదేశీ విద్యా దీవెన పథకంలో అర్హత పొంది కెనడా, ఆస్ట్రేలియాలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు, సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం కింద ఎంపికైన ఇద్దరికి రూ.42,29,591 నమూనా చెక్కును అందజేశారు. సమావేశంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు వై.విశ్వమోహన రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇ.అనురాధ, పలు శాఖ అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

అసాధారణ సవరణలపై ప్రత్యేక దృష్టి

ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలకులు జె.శ్యామలరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురించిన అక్టోబరు 27 నుంచి ఇప్పటివరకు అందులో చేసిన మార్పులు, చేర్పులు, ఇతర సవరణలపై ఏ కోణంలో ప్రశ్న వేసినా సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని ఓటర్ల జాబితా ప్రత్యేక పరిశీలకులు జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. ఈనెల 26వ తేదీ లోగా అన్ని క్లయిమ్‌లను పూర్తి చేయాల్సి ఉన్నందున ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలు ఆ ప్రక్రియలో భాగస్వామ్యమయ్యే ఇతర అధికారులు, బిఎల్ఒలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లా పర్యటనలో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌తో కలిసి ఇఆర్ఒలు, ఎఇఆర్ఒలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఫారం 6, 7, 8 దరఖాస్తుల ఆధారంగా ఓటర్ల జాబితా రూపకల్పనలో అవలంభిస్తున్న విధానాలు, చేపడుతున్న చర్యల గురించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షించారు. జిల్లాలో చేపడుతున్న చర్యల గురించి కలెక్టర్ వివరించారు. ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి ఓటర్లలో చైతన్యం కల్పించామని, యువ ఓటర్లను చేర్పించామని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరించి తొలగింపులు, చేర్పుల ప్రక్రియను చేపడుతూ కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పరిశీలకులు శ్యామలరావు మాట్లాడుతూ ఎలక్టోరల్ పాప్యులేషన్ రేషియో 750కి మించి ఉంటే మరోసారి విశ్లేషణ చేయాలని, ఆ సంఖ్యను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చే వినతులపై సకాలంలో స్పందిస్తూ సమస్యను పరిష్కరించాలన్నారు. పాతపట్నం, ఎచ్చెర్ల నియోజకవర్గాలలో నాలుగు శాతం కంటే అధికంగా నమోదైన చేర్పులు, తొలగింపులు గురించి ప్రత్యేకంగా సమీక్షించారు. సమావేశం అనంతరం ఒక్కో నియోజకవర్గం నుంచి ఐదుగురు బిఎల్ఒలతో ప్రత్యేకంగా మాట్లాడారు. వారి పోలింగ్ స్టేషన్ పరిధిలో సేకరించిన ఫారం 6, 7, 8 దరఖాస్తులను పరిశీలించారు. సమావేశంలో జెసి ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఇఆర్ఒలు నూరుల్ కమర్, ఎస్.భరత్ నాయక్, అర్.వెంకట్రామన్, సిహెచ్.రంగయ్య, బి.పద్మావతి, జి.జయదేవి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రత్యేక పరిశీలకులు శ్యామలరావు

పట్టుసడలని పోరు

- తొమ్మిదో రోజుకు అంగన్వాడీల సమ్మె
- భిక్షాటన, వంటావార్పుతో వినూత్న రీతిలో నిరసనలు
- పలాసలో అంగన్వాడీ కేంద్రాన్ని తెరుస్తున్న అధికారులను అడ్డుకున్న స్థానికులు

ప్రజాశక్తి - విలేకరుల యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు, గ్రాట్యుటీ అమలు తదితర సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన అంగన్వాడీలు పట్టు సడలకుండా పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేస్తున్నారు. అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారానికి తొమ్మిదో రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా భిక్షాటన, వంటావార్పు, నోరు చెవులు మూసుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఏడురోడ్ల కూడలి వద్ద భిక్షాటన చేపట్టిన అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ అధ్యక్షులు కె.కళ్యాణి, టి.రాజేశ్వరి, కె.ప్రమీలాదేవి తదితరులు పాల్గొన్నారు. ఎచ్చెర్లలో భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, వై.విజయలక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు. రణస్థలంలో నోరు, చెవులు మూసుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు కె.సుజాత తదితరులు పాల్గొన్నారు. టెక్కలిలో భిక్షాటన చేపట్టారు. రైతుసంఘం నాయకులు పి.సాంబమూర్తి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.షణ్ముఖరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు డి.ఆదిలక్ష్మి, పి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు. కొత్తూరులో వంటావార్పు చేపట్టి సమ్మె శిబిరాల వద్దే భోజనాలు చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు. కె.లక్ష్మీహేమ, ధనలక్ష్మి, జలజాక్షి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సిర్ల ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. కోటబొమ్మాళి ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధ, సిఐటియు నాయకులు హెచ్.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఆమదాలవలసలో ఐసిడిఎస్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా భిక్షాటన చేపట్టారు. అంగన్వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేస్తూ కంద్రపేట మీదుగా ఐసిడిఎస్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు పంచాది లతాదేవి, పి.భూలక్ష్మి, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పలాసలో కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టి అక్కడ మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్.మోహనరావు, బమ్మిడి ఆనందరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పొందూరులో భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. విఆర్ఎ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.త్రినాథరావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ సమ్మె శిబిరంలో పాల్గొని మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు బి.జ్యోతిలక్ష్మి, జి.నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : భిక్షాటన చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

అంగన్వాడీ సహాయకురాలికి అస్వస్థత

టెక్కలిలో అంగన్వాడీల భిక్షాటన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన నందిగాం మండలం మణిగాంకు చెందిన అంగన్వాడీ సహాయకురాలు బొడ్డ రమణమ్మ ఇందిరాగాంధీ కూడలి వద్ద సొమ్మసిల్లి పడిపోయారు. దీంతో ఆమెను స్థానిక జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉంది.

అధికారులను అడ్డుకున్న స్థానికులు

పలాస మున్సిపాల్టీ పరిధిలోని శాంతినగర్ అంగన్వాడీ కేంద్రం తాళం పగులకొట్టేందుకు ప్రయత్నించిన అధికారులకు చేదు అనుభవం ఎదురైంది. అంగన్వాడీ కేంద్రం తాళాలు పగులకొట్టేందుకు సిద్ధమవుతున్న అధికారులను స్థానికులు అడ్డుకున్నారు. అంగన్వాడీ కార్యకర్త లేకుండా తాళాలు ఎలా పగులకొడతారని అధికారులను ప్రశ్నించారు. మీ సమస్యలపై మీరు సమ్మె చేయరా..? మీకు తక్కువ జీతాలు ఇస్తే మీరు ప్రభుత్వాన్ని ప్రశ్నించరా అని నిలదీయడంతో అధికారులు వెనుదిరిగారు.



మున్సిపల్ కమిషనర్‌తో అంగన్వాడీల వాగ్వివాదం

ఇచ్ఛాపురం పట్టణంలోని గొల్లవీధికి చెందిన అంగన్వాడీ కేంద్రాన్ని తెరిచేందుకు వెళ్లిన మున్సిపల్ కమిషనర్ రమేష్, సచివాలయ సిబ్బందిని అంగన్వాడీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో కమిషనర్ అంగన్వాడీ కార్యకర్తను పక్కకునెట్టి సచివాలయ సిబ్బందితో తాళాలు పగులగొట్టించారు. దీంతో అధికారులతో అంగన్వాడీలు వాగ్వివాదానికి దిగారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తెరుస్తున్నామని కమిషనర్ సర్దిచెప్పడంతో అంగన్వాడీలు వెనుదిరిగారు. సచివాలయ సిబ్బంది అంగన్వాడీ కేంద్రాన్ని స్వాధీనం చేసుకుని కేంద్రంలోని సరుకులను నమోదు చేశారు.

డబ్బులు వసూలు చేశారంటూ స్పీకర్ దృష్టికి తీసుకొస్తున్న మహిళ

దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస : తనపై కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బుధవారం మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధిలో మాసాహెబ్ పేట, కొత్త రోడ్డు ప్రాంతాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్పీకర్ తమ్మినేని సీతారాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొంతమంది మహిళలు కొందరు నాయకులు తాము కట్టుకున్న ఇళ్లను, స్థలాలను క్రమబద్ధీకరిస్తామని, విద్యుత్ మీటర్లను ఇప్పిస్తామని తమ దగ్గర నుంచి డబ్బులు వసూలు చేశారని స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి తీసుకువచ్చారు. తాను కాని తన భార్య వాణి, తన కుమారుడు నాని ఎటువంటి డబ్బులను ఎవరి దగ్గర తీసుకోలేదని స్పీకర్ మహిళలకు తెలిపారు. ఎటువంటి అవినీతికి పాల్పడలేదు కనుకనే ఈరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చానన్నారు. కొంతమంది వ్యక్తులు మాట పేర్లు చెప్పి డబ్బులు వసూలు చేసి ఉండవచ్చని, తొందరలోనే నిజాలను గుర్తిస్తామని మహిళలకు తెలిపారు. తొందరలోనే కొత్త రోడ్డు వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేసి నిజ నిజాలను బయట పెడతానన్నారు. అనంతరం గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి గురుగుబెల్లి సీతారావు, ఎంపిటిసి గురుగుబెల్లి నీలారావు, ఎంపిటిసి తాండ్ర ధనుంజయరావు, వైసిపి నాయకులు గురుగుబెల్లి నవీన్, తాండ్ర రామారావు, తాండ్ర గోవిందరావు, ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు, వ్యవసాయాధికారి తిరుమల మోహనరావు, విద్యుత్ ఎఇ రవికుమార్, పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ దువ్వాడ అమర్నాథ్ పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

ఎఆర్ ఎస్‌ఐ కుటుంబానికి అండ

శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లాలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ విభాగంలో పనిచేసిన ఎఆర్ ఎస్‌ఐ ఎం.లక్ష్మీనారాయణ అనారోగ్యంతో ఈ ఏడాది అక్టోబరులో మృతి చెందారు. ఈ మేరకు మృతుని కుటుంబానికి ప్రభుత్వం వారి నుంచి అడిషనల్ కార్పస్‌ఫండ్ రూ.లక్ష మంజూరైంది. దీనిని జిల్లా పోలీస్ కార్యాలయంలో మృతుడి బార్య ఎం.జ్యోతికి ఎస్‌పి జి.ఆర్.రాధిక చెక్కును బుధవారం అందజేశారు. బాధిత పోలీస్ కుటుంబాలకు జిల్లా పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందని అన్నారు. మీకు ఏ సహాయం కావాలన్న ఫోన్ ద్వారా, స్వయంగా జిల్లా పోలీసు కార్యలయంలో సంప్రదించవచ్చునని సూచించారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.సురేష్ ఉన్నారు.

జీడి సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

మాట్లాడుతున్న మోహనరావు

ప్రజాశక్తి- పలాస

జీడి పిక్కలు 80 కేజీల బస్తా రూ. 16 వేలు మద్దతు ధర ప్రకటించి రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేసే వరకు పోరాటం చేస్తామని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు, ఎపి జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ స్పష్టం చేశారు. కాశీబుగ్గ అమ్మ ఆశ్రమం వద్ద జీడి గిట్టుబాటు ధర కల్పించాలని, పిఎస్ ధనుంజయ రెడ్డితో జరగాల్సిన చర్చలపై బుధవారం రైతు సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలాసలో దళారీ వ్యవస్థ నిర్మూలించాలని డిమాండ్ చేశారు. జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేసి ధరను స్థిరీకరించాలన్నారు. జీడి బోర్డు ఏర్పాటు చేసి పంట విస్తరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. జీడి పూత వస్తున్న కారణంగా పిచికారీ మందులు ఉచితంగా రైతులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వంశధార నుంచి ఇచ్ఛాపురం వరకు సాగునీరు అందించాలన్నారు. కొబ్బరి బోర్డులు ఏర్పాటు చేసి, కాయకు రూ.20 మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని కోరారు. సమావేశంలో అఖిలభారత కిసాన్ మహాసభ జిల్లా కన్వీనర్ మద్దిల రామారావు, ఎపి కొబ్బరి రైతు సంఘం కో-కన్వీనర్లు సాతుపల్లి కృష్ణారావు, బత్తిని లక్ష్మీనారాయణ, కుత్తుం వినోద్‌కుమార్, తమ్మినేని భాస్కర్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పలాస పట్టణ నాయకులు పిన్నింటి నాగేశ్వరరావు, ఎపి రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు గొరకల బాల కృష్ణ, పిఒడబ్ల్యు నాయకులు పాల్గొన్నారు.

తెలుగు మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కెవిజిడి బాలాజీ

ఎచ్చెర్ల : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం-శ్రీకాకుళం ప్రాంగణం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థలు సంయుక్తంగా రాజమహేంద్రవరంలో జనవరి 5, 6, 7 తేదీల్లో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతం చేయాలని, తెలుగు వెలుగులు విశ్వవ్యాప్తం కావాలని ట్రిబుల్ డైరెక్టర్ ప్రొఫెసర్ కెవిజిడి బాలాజీ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అంతరించిపోతున్న తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను, తెలుగుభాష ఔన్నత్యాన్ని తెలియజేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వివిధ సాహితీ ప్రక్రియలోని ప్రముఖ సాహితీ వేత్తలు, వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ప్రముఖులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రచారకమిటీ సభ్యుడు రవికుమార్, అంబేద్కర్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ఉదయ కిరణ్, ఐఐఐటి ఒఎస్‌డి సుధాకర్ బాబు, ఎఒ ముని రామకృష్ణ, డీన్ మోహన్ కృష్ణ చౌదరి, ఎఫ్ఒ డా.అసిరినాయుడు, వెల్ఫేర్ డీన్ గేదెల రవికుమార్, ఐఐఐటి తెలుగు శాఖ అధ్యక్షులు డా. జి.ప్రకాశరావు, డా.పి.ముకుందరావు, డా.పి.చిరంజీవిరావు, పిఆర్ఒ మామిడి షణ్ముఖ నారాయణరావు పాల్గొన్నారు.

దుప్పట్లను పంపిణీ చేస్తున్న వెంకటేష్

సామాజిక కార్యక్రమాలతోనే ఆనందం

ప్రజాశక్తి - ఆమదాలవలస

సామాజిక కార్యక్రమాలతోనే ఎంతో ఆనందం కలుగుతుందని కృత్విక్ ఫౌండేషన్ ఫౌండర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. శ్రీకాకుళం పట్టణానికి చెందిన దుంపల స్వప్న పుట్టినరోజు సందర్భంగా ఆమె భర్త జగదీష్ కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని శివాలయం, రైల్వేస్టేషన్ ఆవరణలో ఉన్న అనాధలు, వృద్ధులు, వికలాంగులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే కృత్విక్ ఫౌండేషన్ ద్వారా రక్తదాన శిబిరాలు, ఆపదలో ఉన్నవారికి ఆర్థికసాయం తదితర కార్యక్రమాలను చేపట్టామని మునుముందు మరెన్నో సామాజిక కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిగురుపల్లి నవ్య, బొడ్డేపల్లి అశోక్, రామారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు చెకుముకి టాలెంట్ టెస్టు

కోటబొమ్మాళి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో గురువారం ఉదయం 10 గంటలకు మండల లెవెల్ చెకుముకి టాలెంట్ టెస్టు జరుగుతుందని జెవివి జిల్లా కార్యదర్శి సామ సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చెకుముకి టాలెంట్ టెస్టు ప్రధానోపాధ్యాయులు డి.గోవిందరావు పర్యవేక్షణలో, సిఎస్ ఫోరం కన్వీనర్ కె.ఆర్.కె.రవికాంత్‌రెడ్డి, సోమశేఖర్, అరుణకుమారి ఆధ్వర్యాన నిర్వహిస్తారని పేర్కొన్నారు. మండలంలోని హైస్కూల్ విద్యార్థులు, కెజిబివి, నలందా పాఠశాలల్లో 8,9,10 తరగతల నుంచి ఒక్కో చొప్పున పాల్గొవాలని కోరారు.

పరిశ్రమ సామగ్రి తరలింపు

వాహనాలను అడ్డుకున్న కార్మికులు

ఆందోళన చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలోని రావివలసలో అల్లాయిస్ పరిశ్రమ కార్మికులు బుధవారం ఆందోళన చేపట్టారు. కొద్ది నెలలుగా పరిశ్రమ లాకౌట్ ఉంది. దీంతో పరిశ్రమకు సంబంధించిన విలువైన సామగ్రిని యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా బయటకు తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న కార్మికులు అడ్డుకున్నారు. చాలా ఏళ్లుగా పరిశ్రమలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు, రోజువారీ కూలీలకు రావాల్సిన బకాయిలతో పాటు ఇతర అంశాలపై పరిశ్రమ యాజమాన్యం అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ గేటు వద్ద బైటాయించి నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి, ఎస్ఐలు ఎల్.రామకృష్ణ, కె.రమేష్‌బాబు, తమ సిబ్బందితో పరిశ్రమ వద్దకు చేరుకుని కార్మికులకు నచ్చజెప్పారు. తమకు అన్యాయం జరుగుతుందని కార్మికులు పోలీసులను ప్రశ్నిస్తూ... వాపోయారు. తమకు బకాయిలు చెల్లించకుండా పరిశ్రమ యాజమాన్యం దోబూచులాడుతుందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు పోలీసుల సమక్షంలో పరిశ్రమలో నుంచి వాహనాలను బయటకు తరలించారు.

చాపరలో బాలిక కిడ్నాప్

మెళియాపుట్టి : మండలంలో చాపర సెగిడి వీధికి చెందిన దీర్ఘాసి నాగమ్మ తన ఐదేళ్ల కుమార్తెను ఒడిశా రాష్ట్రం కాశీనగర్‌కు చెందిన శంకరరావు కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేశారని ఎఎస్ఐ నర్సింగరావు తెలిపారు. శంకరరావు మరొక వ్యక్తి సహాయంతో బైక్‌పై వచ్చి తన కుమార్తె హాసిన్ను బుధవారం బలవంతంగా ఎత్తుకుపోయినట్లు ఫిర్యాదు పేర్కొన్నారని అన్నారు. వ్యక్తిగత కక్షతో శంకరరావు తన పెద్ద కుమార్తెను కిడ్నాప్ చేశాడని తెలిపిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కిడ్నీ వ్యాధితో వృద్ధుడు మృతి

నర్సింహులు (ఫైల్)

పలాస: మండలంలోని గురుదాసుపురం సర్పంచ్ ప్రతినిధి, టిడిపి మండల అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్ కుమార్ తండ్రి కుత్తుం నర్సింహులు (70) కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. నర్సింహులు గతేడాది నుంచి డయాలసిస్ చేసుకుంటున్నారు. ఆయన బార్య లక్ష్మీదేవి కూడా ప్రస్తుతం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపై టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, మాజీ మంత్రి గౌతు శివాజీ, టిడిపి సీనియర్ నాయకులు యార్లగడ్డ వెంకన్నచౌదరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు బి.నాగరాజు, టిడిపి తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, మండల కార్యదర్శి దువ్వాడ సంతోష్‌కుమార్, మాజీ ఎంపిపి బత్తిని హేమేశ్వరరావు సంతాపం తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

కోటబొమ్మాళి: మండలంలో రేగులపాడుకు చెందిన ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన కింజరాపు రమేష్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ బుధవారం తెలిపారు. మహిళ కిరాణా సరుకుల కోసం షాప్‌కి వెళ్లిందని, తిరిగి వస్తుండగా... రమేష్ అసభ్యంగా ప్రవరించారని అన్నారు. బాధిత కుటుంబ సభ్యులు రమేష్ ఇంటికి వెళ్లి అతని భార్యకు వద్ద జరిగిన సంఘటన తెలియజేశారని అన్నారు. దీంతో రమేష్ కోపోద్రిక్తుడై కులం పేరుతో దూషించి కర్రతో దాడి చేశారని తెలిపారు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు రమేష్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఆలయంలో చోరీ

ఎచ్చెర్ల : మండలంలోని తమ్మిరాయుడుపేటలో నాగావళి నదీ తీరాన ఉన్న లలితా చంద్రమహేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. అమ్మవారికి సంబంధించిన నాలుగున్నర తులాల బంగారం, చంద్రమౌళీశ్వరునికి సంబంధించింది. ఆరు కేజీల వెండి దొంగిలించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపాద నరేష్ శర్మ రోజులానే బుధవారం ఉదయం ఆలయాన్ని తెరిచేందుకు వచ్చారు. అప్పటికే తాళం పగలుగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు, క్లూస్ టీం తనిఖీలు చేపట్టింది.

ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కృష్ణమూర్తి

ముగిసిన ఇంధన పొదుపు వారోత్సవాలు

శ్రీకాకుళం: ఈ నెల14 నుంచి వారం రోజుల పాటు ఎపిఇపిడిసిఎల్ ఆధ్వర్యాన నిర్వహించిన ఇంధన పొదుపు వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. జిటి రోడ్డులోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో నిర్వహించిన ముగింపు సభలో ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగిరెడ్డి కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంధన పొదుపు అనేది మానవ అవసరాల్లో ఒకటిగా బావించి పొదుపు పాటించడం అవసరమన్నారు. ప్రతిఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా పొదుపు పాటించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించేందుకు పరోక్షంగా సహకరించిన వారమవుతామన్నారు. పెరుగుతున్న మానవ అవసరాలు అనుగుణంగా విద్యుత్ అందించాలంటే అందుకు సరిపడా వనరులను దృష్టిలో పెట్టుకొని పొదుపు పాటించడం ద్వారా భావితరాలకు వెలుగునిచ్చే వారమవుతామన్నారు. అనంతరం వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇఇ ఎస్.బయ్యన్ననాయుడు, ఇఇలు టి.రాజశేఖర్, ఎల్.సిహెచ్.పాత్రుడు, సుదర్శనరావు పాల్గొన్నారు.

భూ సర్వే ప్రారంభం

భూ సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

రణస్థలం: మండలంలో జెఆర్.పురం పంచాయతీలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జెఆర్.పురం పంచాయతీకి సంబంధించి భూ సమగ్ర సర్వే(రీ సర్వే)ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ డ్రోన్ ఎగురవేసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అస్తవ్యస్థంగా ఉన్న రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన, భూ వివాదాలు, పొలం గట్ల సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా భూముల సమగ్ర రీసర్వే ప్రాజెక్టును వీలైనంత త్వరగా వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్, మండల సర్వేయర్ రవి, వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, జెఆర్.పురం సర్పంచ్ భవిరి రమణ, జెఆర్.పురం-1 ఎంపిటిసి ప్రతినిధి పచ్చిగుళ్ల సాయిరాం, కొండములగాం పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి గొర్లె అప్పలనాయుడు, మోడల్ స్కూల్ కమిటీ ఛైర్మన్ టేకి బ్రహ్మజీ, వైసిపి నాయకులు సత్యంనాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వైసిపి జిల్లా మహిళా విభాగం జనరల్ సెక్రటరీగా గురాన తిరుమల మానస నియమితులైన సందర్భంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గురాన చిరంజీవి, జల్లేపల్లి జనార్దనరావు, లండ కిరణ్, గడి బాబూరావు, పిల్ల సూర్యారావు, పిల్ల వాసు, పాలూరి బుజ్జి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఐతమ్‌కు 'ఇషుజు' ఇంజిన్ కానుక

పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలకు ఆటోమొబైల్ రంగంలో దిగ్గజ కంపెనీ ఇషుజు మోటార్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ 'కట్ సెక్షన్ ఇంజిన్'ను సిఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా కానుకగా అందజేసిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఇషుజు ఇంజిన్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2016 నుంచి ఈ కంపెనీకి ఏటా కనీసం 30 మందికి తక్కువ లేకుండా ఐతమ్ విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు వెళ్లడం, ఉద్యోగాల్లో చేరడం వల్ల ఇషుజు కంపెనీతో సంబంధాలు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో డిప్లొమో మెకానికల్, బిటెక్ మెకానికల్ విద్యార్థులకు, ఫ్యాకల్టీకి, ప్రయోగాత్మకంగా ఇంజిన్‌పై అధ్యయనం చేసే వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ఇంజిన్ డిజైన్‌తో పాటు ఇతర అంశాలను ప్రత్యక్షంగా ల్యాబ్‌లోనే తెలుసుకొనే వీలుంటుందని పేర్కొన్నారు. ఇషుజు కట్ సెక్షన్ ఇంజిన్ అందజేసిన వారిలో ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్, డిజిఎం కె.వేణుగోపాల్, మేనేజర్లు శివకుమార్, శుక్లా మురళి, డిప్యూటీ మేనేజర్ హెచ్ఆర్ ఎస్.నరేష్, కార్పొరేట్ ప్లానింగ్ రుమట్ సునాగాల, ఐతమ్ కోశాధికారి టంకాల నాగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ ఆర్అండ్‌డి డాక్టర్ డి.ఆజాద్, మెకానికల్ విభాగం నుంచి హెచ్ఒడి డాక్టర్ డి.శ్రీరాములు, అసిస్టెంట్ హెచ్ఒడి డాక్టర్ శ్రీహరి, డిప్లొమో డిప్యూటీ డైరెక్టర్ బి.ఎస్.శ్రీనివాసరావు, ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ ఎం.వి.సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు సిఎం జన్మదిన వేడుకలు

కొత్తూరు : కార్లతో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

టెక్కలి రూరల్ : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఈ నెల 21న నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని వైసిపి టెక్కలి నియోజకవర్గం సమన్వయకర్త దువ్వాడ వాణి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ర్యాలీగా వెళ్లి వైఎస్ఆర్ విగ్రహాన్ని పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. రెడ్‌క్రాస్ సంస్థతో కలిసి రక్తదాన శిబిరం ఏర్పాటు, అన్నదానం, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

భారీగా కార్ల ర్యాలీ

కొత్తూరు : వైసిపి జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీవరప్రసాద్ ఆధ్వర్యాన సిఎం జగన్ గురువారం జన్మదినం సందర్భంగా భారీ కార్లతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మండలంలోని మాతల, మాకవరం, పొన్నుటూరు, రుగడ, కమలమ్మ, కొట్టు, పాతపట్నం, పర్లాకిమిడి, వసుంధర, కోసమాల, మెళియాపుట్టి, చాపర, పట్టుపురం, గొప్పిలి, కరజాడ టెక్కలిపట్నం, పెద్దమడి, మెళియాపుట్టిలోని ఆల్ ఆంధ్రా రోడ్డులోని సుందరాడ, తిడ్డిమి, కొరసవాడ, దనుపురం, నవతల అవలింగి, గొట్ట, హిరమండలం, బోర్రంపేట, ఎల్ఎన్ పేట వరకు ర్యాలీ నిర్వహించారు.

మెళియాపుట్టి : సిఎం జగన్ జన్మదిన వేడుకలను విజయవంతం చేయాలని ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్ కోరారు. మండలంలోని గిరిజన గ్రామమైన ముకుందపురంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రెడ్డి శాంతి ముఖ్య అతిథిగా పాల్గొంటారని అన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గ్రీన్‌ఆర్మీ సేవలు అభినందనీయం

పుష్పగుచ్ఛం అందజేస్తున్న గ్రీన్‌ఆర్మీ సభ్యులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గ్రీన్‌ఆర్మీ సమాజానికి అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కార్యదర్శి రోణంకి శాంతకుమారి అన్నారు. మండలంలోని అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో ఉపాధ్యాయ, ఉద్యోగులు, ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజిక స్పృహ కలిగిన సంస్థ గ్రీన్ ఆర్మీ అన్నారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రయత్నం చేస్తుంన్నారు. పర్యావరణం సమతుల్యతకు మొక్కలు నాటడం ఒక ఉద్యమం లా చేపట్టి ముందుకు సాగుతున్న గ్రీన్‌ఆర్మీకి అభినందించారు. అనంతరం బిఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ పాలక మండలి సభ్యులు దానేటి పద్మజ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రీన్‌ఆర్మీ అధ్యక్ష, కార్యదర్శులు బోనెల గోపాల్, బి.తిరుమలరావు, అక్కుపల్లి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.పాపారావు, ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బళ్ల సుభాష్‌బాబు పాల్గొన్నారు.

కేన్సర్ రహిత సమాజ నిర్మాణం అవసరం

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేన్సర్ రహిత సమాజాన్ని నిర్మించాల్సిన అవసరముందని లయన్స్‌క్లబ్ సెంట్రల్ అధ్యక్షులు పొన్నాడ రవికుమార్ అభిప్రాయపడ్డారు. బుధవారం నగరంలో హౌసింగ్ బోర్డు కాలనీలో ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో చైల్డ్ హుడ్ కేన్సర్ పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా సింధూర ఆస్పత్రి సీనియర్ వైద్యులు డాక్టర్ పైడి మాలతి, పైడి సిందూర హాజరై కేన్సర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రవికుమార్ హాజరై మాట్లాడుతూ పిల్లలకు చిన్నపాటి జ్వరం వచ్చిందంటేనే తల్లిదండ్రులు తట్టుకోలేరని, అటువంటి స్థితిలో కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధి ఉందని గుర్తిస్తే తల్లడిల్లి పోతారన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వేల ఆధారంగా ఏటా దాదాపు 75,000 మంది పిల్లలు క్యాన్సర్ బారిన పడుతున్నారని గుర్తుచేశారు. వారిలో 20శాతం పిల్లలు భారత్‌లో నమోదవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పద్నాలుగేళ్లలోపు వారిలో వచ్చే వాటిని చైల్డ్‌హుడ్ కేన్సర్లు పూర్తిగా నయం చేయదగినవేనని నిపుణులు చెబుతున్నారని, అందువల్ల వీటి పట్ల అవగాహన ఉంటే మొదటి దశలోనే వీటిని నయం చేసుకోవచ్చన్నారు. ఈ సదస్సులో స్కూల్ డైరెక్టర్ అన్నెపు రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ బాడాన దేవభూషనరావు, సెక్రటరీ రామ్ గోపాల్, ట్రెజరర్ శిల్లా మణి, సభ్యులు కామేష్, లయన్ తిరుమలరావు పాల్గొన్నారు.

9 నుంచి జాతీయస్థాయి టెన్నీకాయిట్ పోటీలు

పలాస : పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో తొలిసారిగా 47వ జాతీయ స్థాయి సీనియర్ టెన్నీకాయిట్ పోటీలను జనవరి 9 నుంచి 13 వరకు నిర్వహిస్తున్నట్లు జాతీయ పోటీల నిర్వాహక కార్యదర్శి పి..తవిటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా రాష్ట్ర జట్టు ఎంపికలు ఈ నెల 28, 29, 30 తేదీల్లో పాతపట్నంలో జరగనున్నాయని తెలిపారు.

అవినీతి రహిత పాలన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ప్రజల నమ్మకం జగనన్న అని, జగనన్న ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రెయ్యిపాడులో ఎపికి జగనన్న ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమానికి కొత్త భాష్యం చెప్పిన జగనన్న ప్రభుత్వానికి ప్రజలు పూర్తిస్థాయిలో మద్దతు పలుకుతున్నారని అన్నారు. అవినీతికి తావులేని పాలన అందించిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, మండల వైసిపి అధ్యక్షుడు పి.గురయ్యనాయుడు, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి మద్దిల హరినారాయణ, సర్పంచ్ బచ్చల ధర్మారావు, మద్దిల తిరుపతిరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని వెంకటాపురం సచివాలయంలో స్థానిక సర్పంచ్ బెజ్జి జయమ్మ ఆధ్వర్యాన బుధవారం ఎపికి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి గూడ ఎండయ్య మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్లలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి వివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. రైతుల కోసం రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ, రైతు భరోసా వంటి పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి పథకాలో కూడిన ఛార్ట్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో కొత్తూరు సర్పంచ్ గూడ వసంతకుమారి, వెంకటాపురం సర్పంచ్ ప్రతినిధి బెజ్జి పాపారావు, విఆర్ఒ సత్యనారాయణ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : పథకాల ఛార్ట్‌ను ప్రదర్శిస్తున్న జయమ్మ

యువగళానికి తరలివెళ్లిన టిడిపి శ్రేణులు

జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం పోలిపల్లి వద్ద నిర్వహించిన యువగళం ముగింపు సభకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ జెండా ఊపి వాహన శ్రేణి ర్యాలీని ప్రారంభించారు. మున్సిపాలిటీ, మండలంలోని పలు గ్రామాల నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బహిరంగ సభకు బయలుదేరి వెళ్లారు. ఈ బహిరంగసభకు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ హాజరుకానుండడంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఈ సభకు బయలుదేరి వెళ్లారు. కొత్తరోడ్డు, చింతాడ తదితర ప్రాంతాల్లో వాహనాల రద్దీతో కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు నూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావు, అన్నెపు భాస్కరరావు, శివ్వాల సూర్యం, బోర గోవిందరావు, బొడ్డేపల్లి గౌరీపతిరావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: టిడిపి ఆధ్వర్యాన విజయనగరం జిల్లా పోలిపల్లి వద్ద నిర్వహించిన యువగళం సభకు జిల్లా నుంచి పెద్దసంఖ్యలో టిడిపి శ్రేణులు తరలివెళ్లారు. నగరంలో అరసవల్లి నుంచి మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి ఆధ్వర్యాన పెద్దసంఖ్యలో వాహనాలతో బయలుదేరారు. నగరంలో కార్లు, ద్విచక్రవాహనాలు, ఆటోలు బారులు తీరాయి. ఈ ర్యాలీలో నగర

కార్యకర్తలకు అభివాదం చేస్తున్న గుండ దంపతులు

టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణం, జామి భీమశంకర్, ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, విభూది సూరిబాబు, జల్లు రాజీవ్, నాయకులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: విజయనగరం జిల్లా పోలుపల్లి వద్ద నిర్వహించిన యువగళం, నవశకం బహిరంగ సభకు కోటబొమ్మాళి నుంచి పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు తరలి వెళ్లారు. సుమారు 150 వాహనాల్లో టెక్కలి నియోజవర్గం నలుమూలల నుంచి కార్య కర్తల అభిమానులు, నేతలు బయలుదేరి వెళ్లారు.

వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

పెద్దమడిలో క్రీడలు ప్రారంభం

మెళియాపుట్టి : మండలంలోని పెద్దమడి బాలుర కళాశాల ఆవరణలో బుధవారం ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. ఐటిడిఎ ఆధ్వర్యాన జోనల్ మీటుగా ఈ క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు 34 పాఠశాల నుంచి హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, వెస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు, ఎంఇఒ ఎస్.దేవేంద్రరావు, ప్రిన్సిపాల్ అజిత్‌కుమార్, రేణుకేశ్వరరావు, పీడీలు, పిఇటిలు పాల్గొన్నారు.

'పది' మోడల్ పేపర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- కంచిలి

యుటిఎఫ్ నాయకులు మురళీనాయక్, నల్ల రవి, సుదర్శన్ బెహరాలు తయారు చేసిన పదో తరగతి మోడల్ పరీక్ష పేపర్లను ఎంఆర్‌సి వద్ద ఎంఇఒ ఎస్.శివరాంప్రసాద్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించేందుకు ఈ ప్రశ్నపత్రాలను తయారు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.వెంకటరావు, టి.త్రినాథ్ పాల్గొన్నారు.

పేపర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒ శివరాంప్రసాద్

మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రం అగ్రగామి

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో వినూత్న సంస్కరణలను తీసుకొచ్చి సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలిపిన సంక్షేమాభివృద్ధి సారథి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని ఎపి శాసన సభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. బుధవారం మండలం విఆర్.గూడెంలో వై నీడ్స్ ఎపి జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కానన్ని సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్‌లో అమలయ్యాయన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సిఎం రూపొందించారన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాడాన సునీల్, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, స్థానిక నాయకులు సువ్వారి అప్పలనాయుడు, పేడాడ రాములు, సువ్వారి అమ్మినాయుడు, సువ్వారి పెంటయ్య, పేడాడ వెంకటరమణ, సువ్వారి రాజారావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవి నియంత్రణపై అవగాహన

కొత్తూరు : గర్భిణులు హెచ్ఐవి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని ఐసిటిసి కౌన్సిలర్ చింతాడ భాస్కరరావు అన్నారు. మండలంలోని కుంటిభద్రలో సర్పంచ్ అగతముడి పావని అధ్యక్షతన ఎయిడ్స్ నియంత్రణపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎయిడ్స్ అంటూ వ్యాధి కాదన్నారు. ఎయిడ్స్ వ్యాధి సోకకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు సంబంధించిన మందులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆర్.కె.భట్లు, నాగభూషణరావు, శిరీష్, సుజాత, లక్ష్మి, జగదాంబ, అరుణ, ప్రసాద్, సర్వేశ్వరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

కృషి విజ్ఞాన కేంద్రం అందిస్తున్న సేవలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలో గల రస్తాకుంటుబాయిలో గల కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్జీ రంగారావు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నడుస్తున్న కెవికెలోని శాస్త్రవేత్తలు నిత్యం రైతులకు అందుబాటులో ఉంటూ ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తుంటారని కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అనంతరం కెవికెకు అనుసంధానించబడ్డ కళాశాల విద్యార్థులు చేపడుతున్న రావేప్ కార్యక్రమాలు ఆర్‌బికె, కెవికెలో చేపడుతున్న కార్యక్రమాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ టిఎస్ఎస్ పాత్రో, ఎడిఎ నిర్మల జ్యోతి, కెవికె శాస్త్రవేత్తలు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మండలంలో ఎంపిడిఒ పర్యటన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మండను ఎంపిడిఒ కె.గీతాంజలి బుధవారం సందర్శించారు. గర్భిణులను, బాలింతలను యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పోషకాహారం అందుతుందో లేదో తెలుసుకున్నారు. పౌష్టిక పోషకాహారం అందకపోతే అందజేస్తామని చెప్పారు. గ్రామస్తులతో మాట్లాడారు. గ్రామస్తుల సమస్యలు విన్నవించారు.

ఘనంగా చిన్నయసూరి జయంతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలో కేంద్ర గ్రంథాలయ సంస్థలో బుధవారం పరవస్తు చిన్నయసూరి 217వ జయంతోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి బుర్ర కుమార్ రాజు అధ్యక్షత వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ముఖ్య వక్త చిన్నయసూరి సాహితీ పీఠం అధ్యక్షులు జియో లక్ష్మణ్ హాజరై మాట్లాడుతూ కవితలకు ఆహ్వానం పలికితే చాలా నాణ్యమైన కవితలు ఉభయ రాష్ట్రాలనుంచి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి మహ్మద్ రఫీ (ఈవేమన) మాట్లాడుతూ నీతిదాయకమైన మిత్ర లాభం, విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో బి.ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన డి.వి.ఆర్.మూర్తి (శతకవి) రచన చాలా బావుంది అలాగే కవులు చాడ

పూలమాలలు వేసి నివాళ్లర్పిస్తున్న కవులు

శ్రీనివాస్(శ్రీకాకుళం), బి.ఢిల్లేశ్వరరావు (సారవకోట), బండారు. సుజాత, చక్రి మాణిక్యం, పి.అనూష, గంగోత్రి, జి.రోజా(దిమ్మిడి జోల) రాసిన కవితలు చదివి వినిపించారు.

సమీక్షిస్తున్న ఎపిఎం ప్రసాదరావు

వైఎస్ఆర్ ఆసరాపై అవగాహన

ఇచ్ఛాపురం : గ్రామ సంఘ సహాయకులతో, సిబ్బందితో నాలుగో విడత వైఎస్ఆర్‌పై వెలుగు ఎపిఎం ప్రసాదరావు బుధవారం అవగాహన కల్పించారు. మండలంలో అర్హత కలిగిన సంఘాల బ్యాంకు ఖాతా నంబర్లు తప్పులు లేకుండా పరిశీలించాలన్నారు. సంఘ సభ్యులు బయోమెట్రిక్ తీసుకోవాలన్నారు. ప్రతి సంఘం నుంచి అంతర్గత అప్పులు వాడుకునే విధంగా ఆ వివరాలు మొబైల్ బుక్ కీపింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ప్రతి సంఘంలోని సభ్యులు రుణాలు వాడుకొని లబ్ధిదారులుగా మారే తీరు విజయ గాథలపై డాక్యుమెంట్ తయారు చేయాలన్నారు. అన్ని గ్రామ సంఘాల్లో జెండర్ కార్యక్రమాలు విజయ వంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సిసిలు డి.మోహనరావు, డి.లక్ష్మి, అకౌంటెంట్ మోహిని, విష్ణుబాబు, విఒఎలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- సోంపేట

రైతు భరోసా కేంద్రాల ద్వారా నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పిటిసి తడక యశోద కోరారు. స్థానిక పలాసపురం రైతు భరోసా కేంద్రం వద్ద బుధవారం ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళారీల ఇబ్బందులు లేకుండా రైతులకు ప్రయోజనం కలిగించేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. రైతులంతా గ్రామ పరిధిలోని తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తడక జోగారావు, మండల ఎఒ నరసింహమూర్తి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న జెడ్‌పిటిసి

మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగులు

స్థలం కేటాయించాలి

పలాస: రైల్వే విశ్రాంత ఉద్యోగుల సంఘానికి రైల్వేశాఖ స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణాన్ని చేపట్టాలని ఆ సంఘం అధ్యక్షుడు భువనేశ్వరరావు, కార్యదర్శి జీవిరావు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ పారిశ్రామికవాడ పార్కు ఆవరణలో బుధవారం విశ్రాంత రైల్వే ఉద్యోగుల సంఘం ఆత్మీయ కలయిక నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యవహారంపై తాము ఖుర్దారోడ్ రైల్వే అధికారులకు విన్నవించామని అన్నారు. విశ్రాంత ఉద్యోగులకు బ్యాంకుల్లో పెన్షన్ తీసుకునేందుకు, ఇతర పనులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బి.కృష్ణారావు, జె.కామయ్య, డి.రాము, డి.జనార్దన, జిజెఎస్ రెడ్డి, గరుడయ్య, జి.రామచంద్రరావు, సిఎం సింగ్ పాల్గొన్నారు.

ఎంఇఒకి సన్మానం

కవిటి: ఎంఇఒ-1 అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ధనుంజయ మజ్జిని మండలంలోని ఒడియా టీచర్స్ అసోసియేషన్ బుధవారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళై మాట్లాడుతూ మండలంలోనే కాకుండా జిల్లావ్యాప్తంగా ధనుంజయ మజ్జి అందించిన సేవలు ఎప్పటికీ మర్చిపోలేవని అన్నారు. ఇప్పుడు రాష్ట్ర ఎంఇఒ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండలంలోని ఒడియా టీచర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంఇఒను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

విఒఎల సమస్యలు పరిష్కరించాలి

బలిజిపేట : వినతిపత్రాన్ని అందిస్తున్న విఒఎలు

బలిజిపేట: గ్రామైక్య సంఘ సహాయకుల (విఒఎ) సమస్యలను పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి ఇందిరా డిమాండ్ చేశారు. విఒఎల సమస్యల పరిష్కారానికై మండలంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం సిసి మురళికు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఇందిరా సమక్షంలో వినతి పత్రాన్ని అందించారు. ఇందిరా మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, రాజకీయ జోక్యం నియంత్రించాలని, ఒత్తిడి తగ్గించాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో విఒఎలు గౌరీశ్వరీ, జి.భారతి, సుమతి, సత్యవతి, శ్రీదేవి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపకార వేతనానికి యశ్వంత్ ఎంపిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎంపికైన యశ్వంత్

తపాలాశాఖ అందించే ఉపకార వేతనానికి పాత హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఆక్స్‌ఫర్డు స్కూల్ 6వతరగతి విద్యార్థి యశ్వంత్ ఎంపికైనట్లు జిల్లా సూపరింటెండెంట్ పిళ్లా శ్రావణ్ కుమార్ తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. తపాలాశాఖ 6 నుంచి 9 తరగతుల విద్యార్థుల్లో స్టాంపులపై తెలుసుకోవడం, సేకరణ, ప్రదర్శన, భద్రపర్చడం వంటి అంశాల్లో ఆసక్తి పెంచడం కోసం దీన్ దయాళ్ స్పార్శ్‌యోజన పేరుతో పోటీలను నిర్వహించారని, అందులో మెరుగైన వాటిని రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసినట్లు తెలిపారు. విద్యార్థికి ప్రతినెల రూ.500 చొప్పున ఏడాదికి మొత్తం రూ.6 వేలు ఉపకార వేతనం జమ చేస్తామని వివరించారు.

త్రినాథరావును సన్మానిస్తున్న విఆర్‌ఎలు

త్రినాథరావుకు సన్మానం

ప్రజాశక్తి- పొందూరు

విఆర్‌ఎల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా ఎంపికైన రాపాక విఆర్‌ఎ తెండేల త్రినాథరావును స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం విఆర్‌ఎలు ఘనంగా సన్మానించారు. ఈయనతో పాటు జిల్లా సెక్రెటరీ కె.రమణమూర్తిని కూడా సన్మానించారు. విఆర్‌ఎల సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.ఈశ్వరరావు, బి.రాజారావు, బి.పర్వయ్య, ఎన్.రాధ, ఎం.సుజాత, ఆర్.ఉమ, బి.కోటేశ్వరి పాల్గొన్నారు.

అవార్డును అందుకుంటున్న ఎస్‌ఐ వి.సత్యనారాయణ

ఎస్ఐకి ఉత్తమ అవార్డు

పోలాకి: పోలాకి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వి.సత్యనారాయణకు ఉత్తమ అవార్డు లభించింది. ఈ అవార్డును ఎస్‌పి జి.ఆర్.రాధిక చేతులు మీదుగా బుధవారం అందుకున్నారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు పలువురు ప్రశంసించారు. ఈ సందర్భంగా అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

11 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- పోలాకి

స్థానిక ఆస్పత్రి నుంచి 11 మందికి నేత్ర ఆపరేషన్లు నిమిత్తం విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్‌కు నేత్ర వైద్యులు సాంబమూర్తి తెలిపారు. ఆస్పత్రిలో వైఎస్ఆర్ కంటి వెలుగు ద్వారా బుధవారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. వీరికి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించి విశాఖపట్నం పంపించామని తెలిపారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు, మందులు, కళ్లద్దాలు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బస్సులో వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న రోగులు